# సాక్షి రాజన్న సిరిసిల్ల

ఆదివారం । 1 । సెప్టెంబర్ । 2024


## భారీ వర్షం


నేతన్నచౌక్ వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న వరదనీరు


సంజీవయ్యనగర్ వద్ద బారికేడ్లు


వర్షంలోనే వెళ్తున్న యువకులు

- సంజీవయ్యనగర్ రోడ్డు మూసివేత

**సిరిసిల్ల:** జిల్లాలో శనివారం రాత్రి భారీ వర్షం కురిసింది. ముఖ్యంగా జిల్లా కేంద్రం సిరిసిల్లలో కురిసిన వర్షానికి వీధులు జలమయమయ్యాయి. పాతబస్టాండ్ నేతన్నచౌక్ వద్ద రోడ్డుపై వరదనీరు చేరింది. సంజీవయ్యనగర్‌కు వెళ్లే దారిలో వరదనీరు చేరడంతో బారీకేడ్లతో ఆ దారి మూసివేశారు.

**అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దు**

- ఎస్పీ అఖిల్ మహాజన్

భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని ఎస్పీ అఖిల్ మహాజన్ కోరారు. రానున్న 48 గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లా పోలీస్ యంత్రంగాన్ని అప్రమత్తం చేసినట్లు తెలిపారు. జిల్లా పోలీస్‌శాఖ, డీఆర్‌ఎఫ్ బృందాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఎవరైనా ఆపదలో ఉంటే వెంటనే, స్థానిక పోలీస్ అధికారులకు లేదా డయల్ 100కు ఫోన్‌చేసి సహాయం పొందవచ్చని తెలిపారు. మానేరు పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చెరువుల వద్దకు వెళ్లవద్దని కోరారు.

## నిరసనలు.. నిలదీతలు

- సిరిసిల్ల మున్సిపల్ సమావేశం గరంగరం
- 'సాక్షి' కథనంతో జీతాల అంశం సవరణకు నిర్ణయం
- బయోమైనింగ్ బిల్లుల చెల్లింపుపై అధికార పక్షం ఆగ్రహం
- జేఏవోపై కలెక్టర్‌కు ఫిర్యాదుకు తీర్మానం


మాట్లాడుతున్న చైర్‌పర్సన్ జిందం కళ, కమిషనర్ మీర్జా ఫసహత్ అలీబేగ్

**సిరిసిల్లటౌన్:** సిరిసిల్ల మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శనివారం గరం..గరంగా సాగింది. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నుంచి కమీషన్లు తీసుకుని జీతాలు పెంచడం.. బయోమైనింగ్ బిల్లుల పేమెంట్.. తదితర అంశాలపై ప్రతిపక్ష, అధికారపక్షాల నిలదీతలు.. నిరసనల మధ్య కొనసాగింది. 'సాక్షి'లో శుక్రవారం ప్రచురితమైన 'పెంచుకో..పంచుకో' కథనంపై అధికార పక్షాన్ని ప్రతిపక్షాలు నిలదీశాయి.

**రూ.101కే అంత్యక్రియలు**

విద్యానగర్, నెహ్రూనగర్‌లోని వైకంఠథామాల్లో రూ.101కే అంత్యక్రియలు నిర్వహించాలని తీర్మానించారు. సమావేశం అనంతరం తన చాంబర్‌లో చైర్‌పర్సన్ జిందం కళ, కమిషనర్ మీర్జా ఫసహత్ అలీబేగ్ మీడియాతో మాట్లాడారు. ఇప్పటి వరకు రెండు వైకుంఠథామాల్లో అంత్యక్రియలకు రూ.7,500 ఫీజు తీసుకునేదని.. సెప్టెంబర్ 1 నుంచి రూ.101 నామమాత్రపు ఫీజును తీసుకోనున్నట్లు తెలిపారు. ఇతర ఎలాంటి ఫీజు చెల్లించొద్దని కోరారు. వినాయకచవితి, బతుకమ్మ, దసరా పండుగల నిర్వహణకు ఏర్పాట్లకు రూ.43.50లక్షలు కేటాయించినట్లు తెలిపారు. పట్టణాభివృద్ధి, ప్రజా సంక్షేమానికి ఎజెండాలో పొందుపరిచిన 19 అంశాలను కౌన్సిల్ ఆమోదించినట్లు పేర్కొన్నారు. వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**జేఏవోపై కలెక్టర్‌కు ఫిర్యాదు**

డ్రై రీసోర్స్ సెంటర్ ద్వారా చేపట్టిన బయోమైనింగ్‌కు సంబంధించిన రూ.1.08కోట్లు కౌన్సిల్‌కు చెప్పకుండా జేఏవో స్వర్ణలత చెల్లించారని చైర్‌పర్సన్ జిందం కళ, కమిషనర్ మీర్జా ఫసహత్ అలీబేగ్ తెలిపారు. జేఏవో విధుల్లో అలసత్వం వహిస్తూ కార్యాలయం పనులు పెండింగ్‌లో ఉంచడమే కాకుండా కాంట్రాక్టర్ల బిల్లులు చెల్లించకుండా జాప్యం చేస్తున్నారన్నారు. ఆమెపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడానికి కౌన్సిల్ టేబుల్ ఎజెండా ద్వారా ఏకగ్రీవ తీర్మానించినట్లు పేర్కొన్నారు. సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు అందించనున్నట్లు తెలిపారు.

**రెండు అంశాల్లో సవరణలు**

ఎజెండాలోని 6, 17 అంశాల్లో సవరణలు చేసి ఆమోదించాలని కౌన్సిల్ నిర్ణయించింది. ముఖ్యంగా అంశం నంబర్ 17లో ఔట్‌సోర్సింగ్ సిబ్బంది జీతాలు పెంచే అంశంపై ప్రతిపక్షాలు అధికార పక్షంతో వ్యతిరేకించారు. 350 మంది ఉద్యోగులకు 8 మందికి ఎలా పెంచుతారని ప్రశ్నించారు. ఈ అంశంపై అధికార పక్షానికి చెందిన కౌన్సిలర్లు కూడా వ్యతిరేకించగా.. ఔట్‌సోర్సింగ్ సిబ్బంది మొత్తం మందికి పెంచేలా సవరణ చేసి ఆమోదించడానికి నిర్ణయం జరిగింది. అంశం నంబర్ 6లో పట్టణంలో హైమాస్ట్‌లైట్ల ఏర్పాటుకు రూ.5లక్షలు మున్సిపల్ జనరల్ ఫండ్ ద్వారా కేటాయించడానికి కోరగా విలీన గ్రామాలతోపాటు పలువురు కౌన్సిలర్లు నిధులు పెంచాలన్న సూచనతో అదనంగా రూ.5లక్షలు కేటాయిస్తూ సవరించడానికి ఒప్పుకున్నారు.

**మందబలంతో అక్రమాలు**

ప్రతీ కౌన్సిల్ సమావేశం మాదిరిగానే ఇప్పుడు కూడా అధికార బీఆర్‌ఎస్ పెద్దలు తమ ఇష్టారాజ్యంగా ఎజెండా అంశాలను ఆమోదించుకున్నారని బీజేపీ ఫ్లోర్‌లీడర్ బొల్గం నాగరాజగౌడ్, కౌన్సిలర్ గూడూరి భాస్కర్ విమర్శించారు. మీడియాతో మాట్లాడుతూ.. రిపబ్లిక్ డే, పంద్రాగస్టుకు ముద్రించిన కేవలం 400 చొప్పున ఆహ్వాన పత్రాలకు రూ.20వేలు ఖర్చురాశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బయోమైనింగ్‌లో భాగంగా రూ.కోటికి పైగా నిధులను కౌన్సిల్‌కు తెలపకుండా చెక్కులు పాస్ చేసిన ఉద్యోగి జేఏవో స్వర్ణలతను సస్పెండ్ చేయాలని కోరారు. విలీనగ్రామాల్లో శ్మశానవాటికలు నిర్మించాలని కోరారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీతాల పెంపులో కమీషన్ల పర్వంపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

### న్యూస్‌రీల్

**గణేశ్ మండపాల వివరాలు ఆన్‌లైన్ చేయాలి**

- ఎస్పీ అఖిల్ మహాజన్

**సిరిసిల్లక్రైం:** గణేశ్ నవరాత్రులను పురస్కరించుకని ఏర్పాటు చేసే గణేశ్ మండపాల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఎస్పీ అఖిల్‌మహాజన్ సూచించారు. పోలీస్‌శాఖ అధికారిక వెబ్‌సైట్‌లో మండపాల వివరాలు నమోదు చేయాలన్నారు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం రాత్రి 10 గంటల వరకు మాత్రమే మండపాల వద్ద చిన్న స్థాయి స్పీకర్లతో పూజలు చేయాలన్నారు. డీజేలు వినియోగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

**పారదర్శకంగా భూసర్వే చేయాలి**

- అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్



**సిరిసిల్ల:** భూసర్వేలు పారదర్శకంగా నిర్వహించాలని, ప్రభుత్వ పనులకు సంబంధించిన భూసర్వేలు త్వరగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో భూసర్వేయర్లతో శనివారం సమీక్షించారు. జిల్లాలో పనిచేసే ఉద్యోగులు స్థానికంగా అందుబాటులో ఉండాలన్నారు. ప్రభుత్వ సర్వే పనులు పెండింగ్‌లో పెట్టొద్దని ఆదేశించారు. రైతులు, ఇతరుల దరఖాస్తులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. జిల్లాలో ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహించే అధికారులు మూడు రోజుల చొప్పున విధులు నిర్వర్తించాలన్నారు. సర్వేయర్ల పనితీరుపై వారం, నెలవారీ నివేదికలు ఇవ్వాలని సర్వేశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వినయ్‌కుమార్‌కు సూచించారు. ఇటీవల బదిలీపై జిల్లాకు వచ్చిన సర్వేయర్లు పరిచయం చేసుకున్నారు. డివిజన్ ఇన్‌స్పెక్టర్లు బాలచందర్, రత్నం, ఆయా మండలాల సర్వేయర్లు పాల్గొన్నారు.

## వరాల జల్లు

- నెలరోజుల్లో రూరల్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు
- పత్తిపాక రిజర్వాయర్, పాలకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మిస్తాం
- పెద్దపల్లికి బస్‌డిపో, గోదావరిఖని డిపోకు కొత్త బస్సులు
- ఎల్లంపల్లి, ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టుల నిర్వాసితులకు పరిహారం
- జెన్‌కో, సింగరేణి ఆధ్వర్యంలో కొత్త విద్యుత్ కేంద్రం
- రామగుండం పర్యటనలో డిప్యూటీ సీఎం మంత్రుల వెల్లడి


మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వేదికపై మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్

సాక్షి, పెద్దపల్లి/గోదావరిఖని/రామగుండం:

డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్ శనివారం రామగుండం నియోజకవర్గంలో పర్యటించారు. ఈ ప్రాంతంపై వరాల వరద పారించారు. స్థానిక ఎమ్మెల్యేల వినతి మేరకు స్పందించిన మంత్రివర్యులు.. పెండింగ్ పనులకు అతిత్వరలోనే మోక్షం కల్పిస్తామని భరోసా కల్పించారు. మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌తో కలిసి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తొలుత రామగుండం బీ థర్మల్ విద్యుత్ ప్లాంట్‌ను పరిశీలించారు. జెన్‌కో అధికారులతో సమీక్షించారు. ఆ తర్వాత సింగరేణి సెక్టార్‌- 2 వద్ద రూ.3 కోట్ల వ్యయంతో నిర్మించిన నైపుణ్య కేంద్రాన్ని ప్రారంభించారు. రామగుండం కార్పొరేషన్‌లో అమృత్ 2.0 టీయూఎఫ్‌డీఐసీ కింద చేపట్టే అభివృద్ధి పనులు, సింగరేణి రూ.5కోట్లతో చేపట్టిన 23కి.మీ. మేర అంతర్గత రోడ్ల నిర్మాణాలకు భట్టి విక్రమార్క శంకుస్థాపన చేశారు. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అధ్యక్షతన గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో నిర్వహించిన బహిరంగసభలో మాట్లాడారు. 211 మహిళా సంఘాలకు రూ.23.35కోట్ల బ్యాంకు లింకేజీ రుణాల చెక్కులు పంపిణీ చేశారు. మేడిపల్లి ఓపెన్‌కాస్ట్‌లో చేపట్టిన 500 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్ట్ ప్రతిపాదనలను ప్రత్యక్షంగా పరిశీలించారు. పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు విజయరమణారావు, గడ్డం వివేక్, వినోద్, ప్రేమ్‌సాగర్‌రావు, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్‌రావు, సింగరేణి సీఎండీ బలరాం, మేయర్ బంగి అనిల్‌కుమార్, కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్లు అరుణశ్రీ, శ్యామ్‌ప్రసాద్‌లాల్, సింగరేణి తదితరులు పాల్గొన్నారు.

**రూరల్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు**

రామగుండంలో 100మందికి ఉపాధి కల్పించే రూరల్ టెక్నాలజీ సంటర్ అనే సాఫ్ట్‌వేర్ సంస్థను నెలరోజుల్లో ఏర్పాటు చేస్తాం. పెద్దపల్లి – సుల్తానాబాద్ మధ్య దీనికోసం పదెకరాలు గుర్తించాం. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు, స్థానిక యువతకు శిక్షణ ఇచ్చేందుకు సింగరేణి ఆధ్వర్యంలో స్కిల్ సెంటర్ ప్రారంభించాం. సింగరేణి ఖాళీ స్థలాల్లో 3,500 డబుల్‌బెడ్రూమ్ ఇళ్లు నిర్మించి ఇస్తాం. దివంగత సీఎం వైఎస్సార్ హయాంలో 20 వేల ఇళ్ల పట్టాలు పంపిణీ చేశాం. మరో 6వేల పట్టాలు పంపిణీ చేయాల్సి ఉంది. రామగుండంను స్పోర్ట్స్ హబ్‌గా మార్చుతాం. – శ్రీధర్‌బాబు, ఐటీ మంత్రి

**అదనపు బస్సులు కేటాయిస్తాం**

బీఆర్‌ఎస్ ప్రభుత్వం రామగుండాన్ని బొందల గడ్డగా మార్చింది. గోదావరిఖని ఆర్టీసీ బస్‌డి పోను ఆధునికీకరిస్తాం. కొత్తగా 35 బస్సులు కేటాయిస్తాం. పెద్దపల్లిలో బస్‌డిపో ఏర్పాటు చేస్తాం. – పొన్నం ప్రభాకర్, రవాణా శాఖ మంత్రి


సండే స్పెషల్

గతేడాది పెద్దపల్లిలో కొలువుదీరిన మట్టి గణేశుడు

- మట్టి గణపతే.. మా దళపతి
- పర్యావరణ హిత వినాయక విగ్రహాలు
- ఏళ్ల తరబడి తయారు చేస్తూ పంపిణీ
- స్వచ్ఛంద సంస్థల సేవాభావం
- పలుచోట్ల మండపాల్లోనే భారీ విగ్రహాల తయారీ, ప్రతిష్ఠ

ఆది దేవుడు వినాయకుడి నవరాత్రి ఉత్సవాల్లో పలువురు భక్తిభావంతో పాటు సామాజిక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఏళ్ల తరబడిగా మట్టితో తయారు చేసిన గణేశ్ ప్రతిమలను ప్రతిష్ఠిస్తూ పర్యావరణ రక్షణకు పాటు పడుతున్నారు. వివిధ స్వచ్ఛంద సంస్థలు వేల కొద్ది మట్టి ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాయి. కొందరు చిన్న గణపతి నుంచి భారీ విగ్రహాలను నెలకొల్పుతున్నారు. ఈనెల 7న వినాయక చవితి సందర్భంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మట్టి గణపతుల తయారీ, విశేషాలపై..

## ఎకో నాయక..

### కోల్‌కతా గంగ మట్టితో..


రాంనగర్‌లో రూపుదిద్దుకుంటున్న 30 అడుగుల మట్టి గణపతి

**కరీంనగర్‌కల్చరల్:** రాంనగర్ మిత్ర యూత్ ఆధ్వర్యంలో 26 ఏళ్లుగా కరీంనగర్ జిల్లా కేంద్రంలోని రాంనగర్‌లో వినాయక నవరాత్రోత్సవాలు నిర్వహిస్తున్నారు. కాగా 2022లో 26 అడుగుల మట్టి గణపతి, 2023లో 28 అడుగుల విగ్రహం ప్రతిష్ఠించారు. ఈసారి 30 అడుగుల మట్టి గణేశుని విగ్రహం రూపుదిద్దుకుంటోంది. కోల్‌కతా నుంచి గంగ మట్టి తెప్పించి, అక్కడి కళాకారులతో విగ్రహాన్ని తయారు చేయిస్తున్నామని యూత్ ఆర్గనైజర్ కోడూరి అఖిల్‌గౌడ్ తెలిపారు.

### పర్యావరణ హితం.. 'హమ్' లక్ష్యం


మట్టివిగ్రహాలు పంపిణీ చేస్తున్న హమ్ స్వచ్ఛంద సంస్థ బాధ్యులు

కరీంనగర్‌లోని హమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 2014 నుంచి ఏటా 250 మట్టి గణపతి ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. పర్యావరణ హితమే లక్ష్యంగా అవగాహన కల్పిస్తున్నారు. వివిధ కళాశాలల విద్యార్థులతో ర్యాలీ తీసి ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో కలిగే అనర్థాలను ప్రజలకు వివరిస్తూ చైతన్యపరుస్తున్నారు.

### పర్యావరణ పరిరక్షణ.. ఉపాధి


మట్టి విగ్రహాలను తయారు చేస్తున్న మహిళలు

**జ్యోతినగర్(రామగుండం):** ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణకాలనీకి చెందిన తెలంగాణ మహిళామిత్ర, శ్రీసరస్వతీ మహిళా మండలి వ్యవస్థాపకురాలు గోలివాడ చంద్రకళ మట్టి విగ్రహాల తయారీని కుటీర పరిశ్రమగా మార్చుకున్నారు. 19ఏళ్లుగా మట్టి వినాయకులను తయారు చేస్తూ.. చాలామందికి ఉపాధి కల్పిస్తున్నారు. విగ్రహాల తయారీకి గోదావరి మట్టిని వినియోగిస్తున్నారు. మట్టి విగ్రహాలను చేసి స్వచ్ఛంద సంస్థలు, ఎన్టీపీసీ, సింగరేణి సంస్థలకు హోల్‌సేల్ ధరలకు విక్రయిస్తుంటారు.

**ఆర్డర్లను బట్టి..**



ఆర్డర్ ప్రకారం తయారు చేసి ఇస్తున్నాం. విగ్రహాల్లో పాల చెట్టు గింజలను పెడుతున్నాం. నిమజ్జనం చేసిన ప్రాంతంలో ఆ గింజలు మొలకెత్తి పర్యావరణాన్ని కాపాడతాయని చిన్న ప్రయత్నం. విగ్రహాల సైజును బట్టి రూ.20 నుంచి రూ.500 వరకు విక్రయిస్తాం. విగ్రహాలు అవసరమున్న వారు 83413 83334లో సంప్రదించాలి.

– గోలివాడ చంద్రకళ, తెలంగాణ మహిళా మిత్ర అధ్యక్షురాలు

### మరో ఖైరతాబాద్


పెద్దపల్లిలో రూపుదిద్దుకుంటున్న గణపయ్య

**పెద్దపల్లిరూరల్:** 54 ఫీట్ల పే..ద్ద బొజ్జగణపయ్యను పెద్దపల్లిలో ఛత్రపతి యువసేన ఆధ్వర్యంలో నెలకొల్పుతున్నారు. ఖైరతాబాద్ తరహాలో ఇక్కడ ఏటేటా పెరుగుతూ దర్శనమివ్వనున్న భారీ గణేశుని ప్రతిమను తీర్చిదిద్దే పనులు సాగుతున్నాయి. జిల్లా కేంద్రంలోని కాలేజీ మైదానంలో మహామండపాన్ని నిర్మించారు. విగ్రహం ఏర్పాటు పనులను జూలై 19న ప్రారంభించారు. 2022లో 45 ఫీట్ల ఎత్తు, గతేడాది 47 ఫీట్లు, ఈ సారి 54ఫీట్ల విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు. సహజ సిద్ధంగా దొరికే మట్టి, వెదురు, జనపనార, గడ్డి, కర్రలతో విగ్రహం రూపుదిద్దుకుంటోంది.

**కోల్‌కతా కళాకారులతో..**



పెద్దపల్లిలో ప్రతిష్ఠించనున్న 54 ఫీట్ల ఎత్తుగల గణేశుడి విగ్రహాన్ని కోల్‌కతా కళాకారులు తయారు చేస్తున్నారు. కొంత మట్టిని ప్రత్యేకంగా రాజస్తాన్ నుంచి తెప్పించాం. ఇందులో చెరువు మట్టిని వినియోగిస్తున్నాం. – శివంగారి సతీశ్, ఛత్రపతి యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు

### స్నేహశీల యూత్ ఆధ్వర్యంలో..


గతేడాది ముస్తాబాద్‌లో ప్రతిష్ఠించిన మట్టి గణపయ్య

**ముస్తాబాద్(సిరిసిల్ల):** ముస్తాబాద్ మండల కేంద్రంలోని స్నేహశీల యువజన సంఘం ఆధ్వర్యంలో ఏనిమిదేళ్లుగా మట్టి వినాయకులను ప్రతిష్ఠించి పూజలు చేస్తున్నారు. ప్లాస్టర్‌ఆఫ్ పారిస్ వినాయకులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. చెరువులు, వాగులలో నిమజ్జనం చేస్తే కలిగే అనర్థాలను తెలియజేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

### పర్యావరణ రక్షకులు


శ్రీనిధి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మట్టి విగ్రహాల పంపిణీ

**సిరిసిల్లటౌన్:** జిల్లా కేంద్రంలోని 30వ వార్డు శివనగర్‌లో మున్సిపల్ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్ స్నేహితులతో కలిసి శ్రీనిధి పరస్పర సంక్షేమ సంఘం ఏర్పాటు చేశారు. కొన్నేళ్లుగా శివనగర్, బీవైనగర్‌లలో 1,500 చొప్పున మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు గోశికొండ హన్మంత్‌పంతులు తదితరులు ఈ భగవత్ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఇప్పటి వరకు సుమారు 17 వేల విగ్రహాలను పంపిణీ చేశారు.

### మట్టి గణపతులనే పూజిద్దాం..


గతేడాది ఎస్పీ అఖిల్ మహాజన్ చేతులమీదుగా విగ్రహాల పంపిణీ

**సిరిసిల్లటౌన్:** మట్టి వినాయక ప్రతిమలను కొలవడం సంప్రదాయమని సిరిసిల్లకు చెందిన మానేరు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు చింతోజు భాస్కర్ ప్రచారం చేస్తున్నారు. సంస్థ ఆధ్వర్యంలో గోదావరి పాలిమర్స్, సంతోష్ ఎలక్ట్రికల్ ప్రతినిధులు ఐదేళ్లుగా మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్నారు. ఏటా ప్రముఖుల చేతుల మీదుగా సేవా కార్యక్రమాలను చేపడుతున్నారు. స్థానిక శాలివాహన(కుమ్మరి) కళాకారులకు ఆర్డర్లు ఇస్తూ అటు కులవృత్తులకు, కళాకారులకు ప్రోత్సాహం ఇస్తున్నారు.

### 72 ఏళ్లుగా..


మార్కండేయ ఆలయంలో రూపుదిద్దుకుంటున్న మట్టి గణపతి

**జగిత్యాలటౌన్:** జగిత్యాలలోని కృష్ణానగర్ మార్కండేయ ఆలయంలో 1952 నుంచి మట్టి గణపతిని తయారు చేసి పూజలు చేస్తుండటం విశేషం. దాదాపు 72ఏళ్లుగా ఆలయ కమిటీ సభ్యులు, స్థానికులు పర్యావరణ పరిరక్షణపై చిత్తశుద్ధిని చాటుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు. అలాగే జగిత్యాల బైపాస్ రోడ్డులో గోల్డెన్ యూత్ ఆధ్వర్యంలో 40 అడుగుల విగ్రహం, వాణినగర్‌లోని ధర్మశాల ఆంజనేయ స్వామి ఆలయంలో భారీ మట్టి విగ్రహాన్ని ఏర్పాటు చేసి పూజలు చేస్తున్నారు. సత్యసాయి సేవా సమితి, విశ్వహిందూ పరిషత్ తదితర సంస్థలు మట్టి గణపతులను పంపిణీ చేస్తూ ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాయి.

### ఏటా వెయ్యి విగ్రహాలు..


మట్టి విగ్రహాలను అందిస్తున్న క్లబ్ సభ్యులు

**మెట్‌పల్లి(కోరుట్ల):** మెట్‌పల్లిలోని లయన్స్ క్లబ్ సభ్యులు పదేళ్ల నుంచి ఏటా మట్టి విగ్రహాలను అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. పండుగకు కొన్ని రోజుల ముందే విగ్రహాల తయారీకి ఆర్డర్ ఇస్తారు. పండుగ రోజు స్థానిక పాత బస్టాండ్ వద్ద భక్తులకు అందజేస్తారు. పర్యావరణ హితం కోసం దీనిని కొనసాగిస్తామని క్లబ్ అధ్యక్షుడు ఇల్లెందుల శ్రీనివాస్ పేర్కొన్నారు. అలాగే స్నేహాలయ యూత్ సభ్యులు సైతం కొన్నేళ్లుగా మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తూ పర్యావరణ పరిరక్షణకు పాటు పడుతున్నారు.

### ఆకట్టుకునే 'గడ్డి' వినాయకుడు


గడ్డి వినాయకునికి భక్తుల పూజలు (ఫైల్)

**పెద్దపల్లిరూరల్:** ఎక్కడా లేని తీరున పెద్దపల్లి పట్టణంలోని తెనుగువాడలో 48 ఏళ్లుగా గడ్డితో గణేశుడిని తయారు చేసి పూజిస్తున్నారు. విగ్రహాన్ని ప్రతిష్ఠించే చోటనే గడ్డి, వెదురు కర్ర, బట్టతో స్థానికులే తయారు చేస్తారు. వినాయకుని తొండం నుంచి నీరు వచ్చి భక్తులపై పడేలా ఏర్పాటు చేస్తారు. నిమజ్జనం సందర్భంగా నిర్వహించే శోభాయాత్రలో భక్తులు ఈ గణేశుడిని దర్శించి తలపై నీళ్లు పడడంతో సంతోషపడతారు.

## క్లుప్తంగా

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గంభీరావుపేట(సిరిసిల్ల): రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై రామ్మోహన్ వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా పాల్వంచ మండలం సింగరాయపల్లెకు చెందిన చిట్టిగారి దేవేందర్‌గౌడ్(30) శ్రీగాధలోని తన అత్తింటికి వచ్చాడు. గత నెల 30న బైక్‌పై మాచారెడ్డి చౌరస్తాకు వెళ్లి, తిరిగి వస్తున్నాడు. నర్మాల శివారులో వాహనం అదుపుతప్పి, కిందపడ్డాడు. ఈ ఘటనలో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు కుటుంబసభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామ్మోహన్ తెలిపారు.

### ఖాళీ బిందెలతో మహిళల నిరసన



గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేట మండలం నర్మాల గ్రామంలో మంచినీటి కోసం మహిళలు ఖాళీ బిందెలతో శనివారం నిరసన తెలిపారు. గ్రామంలో దాదాపు నెల రోజుల నుంచి నీటి సరఫరా జరుగక తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. కాలిపోయిన మోటార్లకు మరమ్మతులు చేయడం లేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ నీరు కూడా రంగు మారి వస్తోందన్నారు. 6, 8వ వార్డుల్లో తాగు నీటి ఎద్దడి తీవ్రంగా ఉందని తెలిపారు.

### పక్షవాతం బాధితులను ఆదుకోవాలి



ముస్తాబాద్(సిరిసిల్ల): పక్షవాతం బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని పక్షవాతం బాధితులు శనివారం విన్నవించారు. ముస్తాబాద్ గ్రామ చావడిలో పక్షవాతంతో బాధపడుతున్న వారు శనివారం నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ పక్షవాతంతో బాధపడేవారిని దివ్యాంగులుగా గుర్తించాలని కోరారు. పక్షవాత బాధితుడికి నెలకు రూ.4వేల పింఛన్ ఇవ్వాలని కోరారు. మూడు చక్రాల సైకిల్ మోటార్లు అందజేయాలన్నారు. బాలనర్సయ్య, మెంగని శ్రీనివాస్, బండారి రమేశ్, గణేశ్, చిన్నఎల్లయ్య, కట్కూరి పోచయ్య, నల్ల పోచయ్య, బాలయ్య, వెంకటి, సుగుణ, కిషన్, పర్శరాములు, సంజీవ్‌రెడ్డి పాల్గొన్నారు.

### వేములవాడ ఇన్‌చార్జి కమిషనర్‌గా సంపత్‌రెడ్డి



వేములవాడ: వేములవాడ మున్సిపల్ కమిషనర్ అన్వేశ్ రెండు నెలలపాటు సెలవుపై వెళ్లడంతో మేనేజర్ సంపత్‌రెడ్డికి ఇన్‌చార్జి కమిషనర్‌గా బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. దీంతో శనివారం సంపత్‌రెడ్డి ఇన్‌చార్జి కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు.

## అంజన్న దర్శనానికి రెండు గంటలు



సామాన్య భక్తులకు కనిపించని స్వామివారు



క్యూలైన్లలో వేచివున్న భక్తులు



క్యూలైన్‌పై రేకులు లేకపోవడంతో వర్షంలోనే భక్తులు



వై జంక్షన్ వద్ద నిలిచిపోయిన వాహనాలు

- అంతరాలయంలో పూజలు..
- సామాన్య భక్తులకు కనిపించని స్వామివారు
- వర్షంలో ఇబ్బందులు
- వందలాదిగా నిలిచిపోయిన వాహనాలు

కొండగట్టు(చొప్పదండి): జగిత్యాల జిల్లా కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి ఆలయానికి శనివారం వేలాది మంది భక్తులు తరలివచ్చారు. స్వామివారి దర్శనానికి రెండు గంటలు పట్టింది. అదే సమయంలో వర్షం పడటం, గోపురం సమీపంలోని క్యూలైన్‌పై రేకులు లేకపోవడంతో భక్తులు తడుస్తూ ఇబ్బంది పడ్డారు. వై జంక్షన్ సమీపంలో వాహనాలు వందలాదిగా నిలిచిపోయాయి. సమీపంలో ఇద్దరు పోలీసులు మాత్రమే ఉండటంతో వాటిని పంపించడం కష్టమైంది. సరైన పార్కింగ్ స్థలం లేక వాహనదారులు అవస్థలు పడ్డారు. అంతరాలయంలో పలువురు భక్తులు పూజలు చేయడంతో సామాన్య, ప్రత్యేక దర్శన టిక్కెట్ల భక్తులకు స్వామివారు కనిపించలేదు. చివరకు దేవున్ని చూడకుండానే వెనుదిరగాల్సిన వచ్చిందన్నారు. రద్దీ సమయాల్లో బ్రేక్ సమయం తీసుకొని, అంతరాలయ దర్శన టికెట్ ద్వారా వచ్చిన భక్తులను అనుమతించాలని పేర్కొన్నారు. ఆలయ ఈవో రామకృష్ణారావు, ఏఈవో అంజయ్య, అధికారులు ఉమామహేశ్వరరావు, హరిహరనాథ్, చంద్రశేఖర్, రాజేందర్‌రెడ్డి, సిబ్బంది అందుబాటులో ఉండి, సేవలందించారు.

## అర్హులకు న్యాయం చేస్తాం

- నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి
- చీర్లవంచలో నిర్వాసితులతో సమావేశం
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా

వేములవాడఅర్బన్: మిడ్‌మానేర్ నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, అర్హులకు న్యాయం జరిగేలా చూస్తానని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. వేములవాడ మండలంలోని మిడ్‌మానేర్ ముంపు గ్రామాలు ఆరెపల్లి, సంకెపల్లి, రుద్రవరం, కొడుముంజ, అనుపురం, శాభాష్‌పల్లి, చింతల్‌ఠాణా, చీర్లవంచ, గుర్రంవాణిపల్లి నిర్వాసితులతో శనివారం చీర్లవంచలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు సమస్యలను నిర్వాసితులు విప్ ఆది శ్రీనివాస్‌కు, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాకు విన్నవించారు. ముంపు గ్రామాలను ఆనుకుని ఉన్న రియల్ ఎస్టేట్ వెంచర్లకు డీటీసీపీ అనుమతులు పొందారో.. లేదో? తెలుసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ భూములపై సర్వే చేసి నివేదిక ఇవ్వాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ నోటిఫైడ్ కానీ వారి దరఖాస్తులపై మరోసారి అధికారులతో సర్వే చేయిస్తామన్నారు. వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్, ఎస్డీసీ రాధాబాయ్, డీఆర్డీవో శేషాద్రి, వేములవాడ తహసీల్దార్ మహేశ్‌కుమార్ పాల్గొన్నారు.

**రోగ నిర్ధారణ పరీక్షల సంఖ్య పెంచాలి**

తంగళ్లపల్లి(సిరిసిల్ల): వర్షాకాలం నేపథ్యంలో దవాఖానాల్లో రోగ నిర్ధారణ పరీక్షల సంఖ్య పెంచాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశించారు. తంగళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం తనిఖీ చేశారు. దవాఖానా ఆవరణ పరిశుభ్రంగా ఉండాలని సూచించారు. సీసీ టీవీని మరమ్మతు చేయించాలని ఆదేశించారు. మెడికల్ అధికారి స్నేహ, హోమియో డాక్టర్ దీప్తి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

**వసతిగృహ విద్యార్థులకు వైద్యపరీక్షలు చేయాలి**

సిరిసిల్ల: జిల్లాలోని ప్రభుత్వ వసతి గృహాల్లోని విద్యార్థులకు ప్రతీ 15 రోజులకోసారి వైద్యపరీక్షలు చేయాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం వసతిగృహాలను నిర్వహించే ప్రైవేటు భవనాల యజమానులు, ప్రిన్సిపాళ్లతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రైవేట్ భవనాల్లో కొనసాగుతున్న హాస్టళ్లలో అవసరమైన వసతులు భవన యజమానులు కల్పించాలన్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి, వసతి గదులు, టాయిలెట్స్, మెస్ హాల్ ఉండాలన్నారు. ఈమేరకు ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. కిటికీలు, డోర్లకు దోమతెరలు, ఎగ్జాస్ట్ ఫ్యాన్లు సమకూర్చాలని సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ హాస్టళ్లలో పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ ఇంజినీరింగ్ అధికారులు సర్వే చేసి వసతులపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. వంట చేసే వారికి సైతం వైద్యపరీక్షలు చేయించాలని, నిలువ ఉన్న ఆహారం ఇవ్వకూడదని ప్రిన్సిపాళ్లకు సూచించారు. జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్, జోనల్ ఆఫీసర్ ప్రత్యూష, సాంఘిక సంక్షేమ గురుకులాల కోఆర్డినేటర్ థెరిసా, ప్రిన్సిపాళ్లు, భవన యజమానులు పాల్గొన్నారు.

## రాజన్న సన్నిధి.. భక్తుల రద్దీ



ఆలయ ఆవరణలో భక్తులు



నవగ్రహాలకు పూజలు చేస్తున్న భక్తులు

వేములవాడ: వేములవాడ రాజన్న ఆలయంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. వీకెండ్ కావడంతో వివిధ ప్రాంతాల నుంచి 25 వేల మంది వచ్చారని ఆలయ అధికారులు తెలిపారు. ధర్మగుండంలో స్నానాలు చేసిన భక్తులు స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారని పేర్కొన్నారు. వారికి ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

**శనిత్రయోదశి వేడుకలు**

వేములవాడ రాజన్న ఆలయ అనుబంధ భీమేశ్వర స్వామి ఆలయంలో శనిత్రయోదశి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. భక్తులు నవగ్రహాలకు పూజలు చేశారు.

## వినాయక చవితికి ప్రత్యేక ఏర్పాట్లు

- సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు
- మున్సిపల్ సమావేశంలో తీర్మానం




మాట్లాడుతున్న చైర్‌పర్సన్ మాధవి

వేములవాడ: వినాయక చవితికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామని వేములవాడ మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి పేర్కొన్నారు. శనివారం నిర్వహించిన మున్సిపల్ సమావేశంలో 42 అంశాలతోపాటు టేబుల్ ఏజెండాలోని 6 అంశాలను ఆమోదించినట్లు తెలిపారు. అన్ని వార్డుల్లో ఫాగింగ్, యాంటీ లార్వా స్ప్రే చేయాలని, రోడ్డుకిరువైపులా ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించి బ్లీచింగ్ చల్లాలని ఆదేశించినట్లు చెప్పారు. ప్రస్తుతం ఉన్న కమిషనర్ అన్వేశ్ రెండు నెలలు సెలవులో వెళ్లడంతో ఇన్‌చార్జి కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన సంపత్‌రెడ్డిని పాలకవర్గ సభ్యులు సన్మానించారు. వైస్‌చైర్మన్ బింగి మహేశ్, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, డీఈ తిరుపతి, ఏఈ నర్మద, టీపీవో అన్సార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కమిషనర్ మీర్జా ఫసహత్ అలీబేగ్‌కు వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

- ఏరియర్స్ ఇవ్వాలని వినతి

సిరిసిల్లటౌన్: మున్సిపల్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ కోరారు. మున్సిపల్‌లో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న శానిటేషన్ ఇతర విభాగాల కార్మికులకు పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కమిషనర్ మీర్జా ఫసహత్ అలీబేగ్, చైర్‌పర్సన్ జిందం కళతో పాటు కౌన్సిలర్లు అందరికీ వినతి పత్రాలు అందించారు. 11వ పీఆర్సీలో పెంచిన ఐదునెలల ఏరియర్స్ బకాయిలు రావాల్సి ఉందన్నారు. పండుగలను దృష్టిలో ఉంచుకుని కార్మికులకు పీఆర్సీ డబ్బులు ఇప్పించాలని, పీఎఫ్,ఈఎస్ఐ, ఐడీకార్డులు ఇవ్వాలని కోరారు. కౌన్సిల్, అధికారులు స్పందించకుంటే పనులు బంద్ చేస్తామని హెచ్చరించారు. నాయకులు అన్నల్‌దాస్ గణేష్, కాసారపు శంకర్, సుల్తాన్ నర్సయ్య, నరేష్, బాలయ్య, భారతవ్వ, రమ, శ్రీనివాస్ తదితరులున్నారు.

## సింగిల్‌విండో సీఈవోపై పోలీసులకు ఫిర్యాదు



ఫిర్యాదు చేసేందుకు ఠాణాకు వచ్చిన వృద్ధులు

చందుర్తి(వేములవాడ): చందుర్తి సింగిల్‌విండో సీఈవో గంగారెడ్డిపై మండలంలోని జోగాపూర్, ఎన్గల్, మల్యాల, తిమ్మాపూర్ రైతులు పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. తమకు తెలియకుండానే అదనంగా రుణం తీసుకున్నాడని జోగాపూర్‌కు చెందిన బాపురావుతోపాటు మరో 15 మంది రైతులు ఫిర్యాదు చేశారు. అధికారుల విచారణలో తేలిన రూ.32.34లక్షలు కాకుండా అదనంగా మరో రూ.40లక్షలకు వరకు సొమ్ము స్వాహా చేశాడని పాలకవర్గ సభ్యులు, బాధిత రైతులు వాపోతున్నారు.

## గద్దర్ పురస్కారం ప్రదానం



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేటకు చెందిన కళాకారుడు ఏర్పుల దేవయ్య శనివారం గద్దర్ పురస్కారం అందుకున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా తొర్రూర్‌లో గిద్దె గళం వ్యవస్థాపకుడు గిద్దె రాంనర్సయ్య ఆధ్వర్యంలో కళాకారుల సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గద్దర్ అవార్డును గద్దర్ కూతురు వెన్నెల చేతుల మీదుగా బహూకరించారు.

## నిధుల దుర్వినియోగంపై ముగ్గురి రిమాండ్

వేములవాడరూరల్: మార్క్‌ఫెడ్‌లో ఎరువుల విక్రయాల్లో నిధుల దుర్వినియోగానికి పాల్పడిన ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్లు వేములవాడరూరల్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. జిల్లాలోని మార్క్‌ఫెడ్‌లో ఎరువుల విక్రయాలకు సంబంధించిన బకాయిల వసూలు విషయంలో అవతవకలు జరిగినట్లు యాజమాన్యం గుర్తించి, విచారణకు ఆదేశించినట్లు తెలిపారు. వేములవాడలో డీసీఎంఎస్‌కు సంబంధించి 2022 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు రూ.76,77,325 మార్క్‌ఫెడ్‌కు చెల్లించకుండా సొంతానికి వాడుకున్నట్లు గుర్తించి నివేదిక సమర్పించినట్లు తెలిపారు. జిల్లాలోని మార్క్‌ఫెడ్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ పి.రమేశ్ తన భార్య పేరుతో ఉన్న డీసీఎంఎస్ కోసం అడ్వాన్స్ చెల్లించకుండానే అకౌంటెంట్ భాస్కర్ సహాయంతో నగదు చెల్లించినట్లు స్టేట్‌మెంట్ తయారు చేయించి డిస్ట్రిక్ట్ మేనేజర్ దివ్యభారతికి అన్ని సరిగ్గా ఉన్నట్లు నమ్మించి ఎరువులు తీసుకున్నట్లు పేర్కొన్నారు. అంతేకాకుండా ఆ ఎరువుల డబ్బులు తిరిగి చెల్లించలేదని సీఐ వివరించారు. విచారణ అనంతరం ఇద్దరు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు రమేశ్, భాస్కర్‌ను ఉద్యోగంలో నుంచి తొలగించడంతోపాటు డిస్ట్రిక్ట్ మేనేజర్‌ను సస్పెండ్ చేసినట్లు వివరించారు. రమేశ్, భాస్కర్‌లపై వేములవాడరూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా రూరల్ ఎస్సై మారుతి క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. రమేశ్, భాస్కర్‌తోపాటు డిస్ట్రిక్ట్ మేనేజర్ దివ్యభారతిని శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు.

## వినాయక మండపాల్లో డీజేలకు అనుమతి లేదు

- సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి



మాట్లాడుతున్న సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి

గంభీరావుపేట(సిరిసిల్ల): వినాయక మండపాల వద్ద డీజేలకు అనుమతి లేదని, మండపాల నిర్వాహకులు పోలీసుశాఖకు సహకరిస్తూ శాంతియుత వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించుకోవాలని సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. గంభీరావుపేట మండలకేంద్రంలో శనివారం గణేశ్ మండపాల నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ప్రతీ మండపం దగ్గర సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, మండపాల వద్ద మద్యం సేవించడం, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. బ్లూకోల్ట్స్ సిబ్బంది తరచూ మండపాలను సందర్శిస్తారని, నిర్వాహకులు సహకరించాలన్నారు. ఇనుప వస్తువులతో మండపాలు ఏర్పాటు చేసుకోవద్దని సూచించారు. విద్యుత్‌శాఖ అనుమతి తీసుకోవాలని సూచించారు. నిమజ్జనం రోజున డీజేలు ఏర్పాటు చేసుకున్న కేసులు నమోదు చేస్తామన్నారు. ఎల్లారెడ్డిపేట సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్సై రామ్మోహన్ పాల్గొన్నారు.

## అధిక వడ్డీలకు అప్పులిస్తున్న వ్యక్తికి జరిమానా


ఇల్లంతకుంట(మానకొండూర్): అధిక వడ్డీలకు అప్పులిస్తున్న ఓ వ్యక్తికి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా రూ.2 లక్షల జరిమానా విధించారని సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి శనివారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ఇల్లంతకుంట మండలంలోని పెద్దలింగాపూర్‌కు చెందిన మొల్లంకుల బాలయ్య అధిక వడ్డీలకు అప్పులిస్తున్నాడని పోలీసులకు గత ఏప్రిల్‌లో సమాచారం వచ్చింది. అతని ఇంట్లో తనిఖీలు నిర్వహించగా ప్రామిసరీ నోట్లు, చెక్కులు, డాక్యుమెంట్స్ లభ్యమయ్యాయి. వాటిని స్వాధీనం చేసుకొని, బాలయ్యపై కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం కలెక్టర్ జరిమానా విధించారని సీఐ పేర్కొన్నారు. ప్రజల అవసరాలను ఆసరాగా తీసుకొని, అధిక వడ్డీలకు అప్పులిచ్చేవారిపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఇల్లంతకుంట ఎస్సై శ్రీకాంత్ గౌడ్, పోలీసు సిబ్బంది ఉన్నారు.



## లారీ కింద కూర్చుంటే.. ప్రాణం పోయింది

చొప్పదండి: వర్షం పడుతోందని ఓ యువకుడు లారీ కింద కూర్చున్నాడు.. డ్రైవర్ ఆ వాహనాన్ని వెనక్కి తీయడంతో అతని కాలు పైనుంచి వెళ్లగా.. పరిస్థితి విషమించి మృతిచెందాడు. ఎస్సై అనూష వివరాల ప్రకారం.. చొప్పదండి మండలంలోని చాకుంటకు చెందిన దాసరి సంజీవ్ శనివారం చొప్పదండికి వెళ్లి వస్తాయని ఇంట్లో చెప్పి, బయలుదేరాడు. చొప్పదండి శివారుకు చేరగానే భారీ వర్షంకురిసింది. దీంతో అతను సమీపంలోని పెట్రోల్ బంకులోకి వెళ్లాడు. అక్కడే ఉన్న ఓ లారీ కింద కూర్చున్నాడు. డ్రైవర్ గమనించకుండా లారీని వెనక్కి తీశాడు. టైర్లు సంజీవ్ కుడి కాలు పైనుంచి వెళ్లడంతో విరిగింది. స్థానికులు వెంటనే అంబులెన్స్‌లో కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కుటుంబసభ్యులు వరంగల్ ఎంజీఎంకు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి సోదరుడు అనిల్ ఫిర్యాదు మేరకు లారీడ్రైవర్‌పై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

## ఇద్దరు ఎఫ్‌బీవోలకు పదోన్నతి



పదోన్నతి పొందిన ఎఫ్‌బీవోలతో డీఎఫ్‌వో బాలమణి

కరీంనగర్ అర్బన్: ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ల(ఎఫ్‌బీవోలు)కు పదోన్నతి కల్పిస్తూ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఉత్తర్వులు జారీ చేశారు. రాజన్న జోన్‌లో ఐదుగురికి, కామారెడ్డి జిల్లాలో ఇద్దరికి, మెదక్ జిల్లాలో ఒకరికి, కరీంనగర్ జిల్లా నుంచి ఇద్దరికి పదోన్నతి లభించింది. ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్(ఎఫ్‌ఎస్‌వో)గా కరీంనగర్ ఎఫ్‌బీవో మహమ్మద్ అజీముద్దీన్, గంగాధర ఎఫ్‌బీవో అనంతరాములు ప్రమోషన్ పొందారు.

## మూడేళ్లు.. ఏడుగురు ఎస్సైలు

- ఆరోపణలతోనే బదిలీలు
- స్థానికంగా చర్చనీయం




చందుర్తి పోలీస్ స్టేషన్

చందుర్తి(వేములవాడ): చందుర్తి ఠాణా ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ఇక్కడికి వస్తున్న ఎస్సైలు తక్కువ కాలంలోనే ఆరోపణలు ఎదుర్కొంటూ బదిలీలు అవుతుండడం హాట్‌టాపిక్‌గా మారింది. గత మూడేళ్లలో చందుర్తి ఠాణాకు ఏడుగురు ఎస్సైలు వచ్చి.. వివిధ ఆరోపణలు ఎదుర్కొంటూ బదిలీలు కావడం చర్చనీయాంశమైంది.

**అసలేమైంది?**

రెండేళ్ల క్రితం ఇక్కడ పనిచేసిన ఓ మహిళ సీఐ వ్యవహారంతో ఈ ఠాణా చర్చలోకి వచ్చింది. అప్పటి నుంచి ఈ ఠాణాలో పనిచేస్తున్న ఎస్సైలపై అనేక ఆరోపణలు వస్తున్నాయి. దీంతో ఈ ఠాణాపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారని ప్రచారం ఉంది. ఈ ప్రాంతంలో జరుగుతున్న ప్రతీ విషయాన్ని ఎస్‌బీ పోలీసులు సేకరిస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. పలు ఆరోపణలు రావడంతో ఎస్సై శ్రీకాంత్‌ను ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ అయ్యాయి.

**నిర్లక్ష్యం.. ఆరోపణలు**

పలు కేసుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే చందుర్తి ఎస్సైపై జిల్లా అధికారులు యాక్షన్ తీసుకున్నట్లు తెలుస్తోంది. చందుర్తి సింగిల్‌విండో సీఈవోపై కేసు నమోదు చేయకపోవడాన్ని ఉన్నతాధికారులు తీవ్రంగా పరిగణించినట్లు సమాచారం. తిమ్మాపూర్ గ్రామంలోని జరిగిన దాడిలో ఓ వర్గంపై కేసు పెట్టి, మరో వర్గాన్ని విస్మరించాడన్న ఆరోపణలు ఉన్నాయి. అన్యాయానికి గురైనట్లు భావించిన మరో వర్గం సీసీ ఫుటేజీలతో జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. అంతేకాకుండా నర్సింగాపూర్‌లో ఓ భూవివాదం కేసు విచారణలో నిర్లక్ష్యంగా వ్యవహరించాడన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాగా అదే గ్రామానికి చెందిన ఓ యువకుడు ఎస్సై తీరుపై జిల్లా ఎస్పీతోపాటు డీజీపీకి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ ఫిర్యాదులపై వేములవాడ ఏఎస్పీ విచారణ చేపట్టినట్లు సమాచారం.

**సోషల్ మీడియాలో ప్రచారం**

చందుర్తి ఎస్సై విధుల్లో నిర్లక్ష్యంతోనే బదిలీ అయ్యారంటూ సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. కేసుల నమోదులో వివక్ష కారణమే పోస్టింగ్‌కు ఎసరు వచ్చిందంటూ స్థానికంగా సోషల్‌మీడియాలో ప్రచారం జరుగుతోంది.